క్లుప్తంగా

కార్డుదారులకు ఉచితంగా బియ్యం

మదనపల్లె : ప్రజాపంపిణీ వ్యవస్థలో భాగంగా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూపాయి కిలో బియ్యం జనవరి నుంచి పూర్తిగా ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ సీకే.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రేషన్‌కార్డుదారులు ఇకపై బియ్యంకు డబ్బులు చెల్లించనవసరం లేదన్నారు. కందిపప్పు, చక్కెరకు మాత్రమే ప్రభుత్వ నిర్ణీత ధర చెల్లించాలన్నారు. రేషన్ డీలరు, ఎండీయూ ఆపరేటర్ ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే మండల తహసీల్దార్ సెల్ 9491077053కు ఫోన్ లేదా మెసేజ్ చేయాలన్నారు. డబ్బులు వసూలు చేసిన డీలర్లు, ఎండీయూ వాహన ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పీలేరు రూరల్ : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ వై. గురుప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలు కొన్నా, అమ్మినా చట్టరీత్యా నేరమన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, సిబ్బంది రాఘవయ్య, సుధాకర్, సురేష్, మహేశ్వరి, జయభాను పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పెద్దమండ్యం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.వెంకటేష్ హెచ్చరించారు. మండలంలోని కలిచెర్ల పరుషతోపు, పెద్దమండ్యం వారపు సంత పరిసర ప్రాంతాలలో మంగళవారం చెట్లకింద వ్యర్థ పదార్థాలను గుర్తించి సిబ్బందితో కలిసి కాల్చివేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి, అల్లర్లకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

జూదరుల అరెస్టు

కలకడ: మండలంలో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్ట్ చేసి రూ.7400 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సిటి స్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. జూదరులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పోలీసులు శ్రీనివాసులు, ఖలీల్, రమేష్, నాగిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తంబళ్లపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం మదనపల్లె తిరుమల మెడికేర్ ఆసుపత్రి డాక్టర్లు తరుణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీశ్రీ రెడ్డిల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 1000 మందికి డయాబెటిక్, బీపీ, షుగర్‌లకు పరీక్షలు చేసి వైద్య చికిత్స అందించారు. అలాగే మందులు ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో ఆసుపత్రి సిబ్బంది జోత్స్న, భానుప్రియ, అనుష, భారతి, నరేష్‌కుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సమ్మేటివ్ వన్ పరీక్షలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుంచి సమ్మేటివ్ వన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ నారాయణ మంగళవారం పేర్కొన్నారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు నిర్వహించే ఈ పరీక్షలు ఈ నెల 10 వరకు జరుగుతాయని ఎంఈఓ తెలిపారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు



పీలేరు రూరల్ : మండలంలోని బోడుమల్లువారిపల్లె, గూడరేవుపల్లె గ్రామాల సరిహద్దు ప్రాంతంలో అక్రమ నిర్మాణాలను తొలగించారు. మంగళవారం తహసీల్దార్ రవి తమ సిబ్బందితో వెళ్లి స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో సర్వే నెంబరు 909/4లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను జేసీబీతో తొలగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్, విలేజ్ సర్వేయర్ హేమ, వీఆర్ఏ రత్న పాల్గొన్నారు.

వైభవంగా వైకుంఠ ద్వార దర్శనం

వాల్మీకిపురం : వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా మంగళవారం ద్వాదశి రోజున వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో ఏర్పాటు చేసిన వైకుంఠ ద్వారం గుండా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే



మదనపల్లె: సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా నివాళులు



పీలేరు: సావిత్రబాయిపూలే జయంతిలో వివిధ సంఘాల నాయకులు

మదనపల్లె : సావిత్రీబాయిపూలే గొప్ప సంఘ సంస్కర్త అని పలువురు కీర్తించారు. మంగళవారం సావిత్రీబాయి పూలే 192వ జయంతి సందర్భంగా పట్టణంలో పలుచోట్ల ప్రజాసంఘాల నాయకులు, పాఠశాలలు, కళాశాలల్లో వేడుకలు నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆమె సేవలను కొనియాడారు. విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే)పార్టీ, భారతీయ అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో సావిత్రీబాయి చిత్రపటాన్ని పూలతో సత్కరించి నివాళులు అర్పించారు. బ్రాహ్మణీయ మనువాద వ్యవస్థ బ్రాహ్మణ స్త్రీలకు చదువును దూరంచేసిన రోజుల్లో భర్త జ్యోతిరావు పూలే ఇచ్చిన ప్రేరణ, ప్రోత్సాహంతో విద్య నేర్చుకుని దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా పాఠశాలలు స్థాపించిన చదువుల తల్లి అంటూ కీర్తించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గోపతిబాల కృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సావిత్రీ బాయి పూలే జయంతిని నిర్వహించారు. వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి స్థానిక కార్యాలయంలో పట్టణ మహిళా అధ్యక్షురాలు చింతమాకులపార్వతి, మండల అధ్యక్షులు సద్దలజయసింహ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె

మదనపల్లె సిటీ: ఉపాధ్యాయ వృత్తికి సావిత్రిబాయి పూలే వన్నె తెచ్చిందని స్థానిక మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణవేణి అన్నారు. మంగళవారం కాలేజీలో సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మహనీయురాలు సావిత్రిబాయి

బి.కొత్తకోట: దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే మహనీయురాలని ఎంఈఓ రెడ్డిశేఖర్ అన్నారు. మంగళవారం బీసీకాలనీ పాఠశాలలో ఆమె జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బాలిక విద్యను ప్రోత్సహించి, మహిళల హక్కుల కోసం పోరాటం చేశారన్నారు. హెచ్ఎం ఖాజాపీర్, బాస్ నాయకులు సచిన్, వెంకటేష్, నక్కామహేష్,రాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీబీవీలో సావిత్రిభాయిపూలే జయంతి

పెద్దమండ్యం: మండలంలోని శిద్దవరం కస్తూర్బా గాంధి బాలికల గురుకుల విద్యాలయంలో మంగళవారం సావిత్రిభాయిపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఫోర్డ్ సంస్థ మండల కో ఆర్డినేటర్ నరసింహులు మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తొలిగించేందుకు సావిత్రి భాయి పూలే ఎంతో శ్రమించారన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ కుమారి, ఉపాధ్యాయులు, ఫోర్డ్ సంస్థ సిబ్బంది రెడ్డెమ్మ, అనిత పాల్గొన్నారు.

వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..

పీలేరు : వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. భారతీయ అంబుడ్కర్ సేన ఆధ్వర్యంలో కోళ్లపారం గ్రామంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే బహుజన సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు వద్ద సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు టి.ధరణికుమార్, పాలకుంట శ్రీనివాసులు, బలరాం, నారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

తొలితరం మహిళా ఉద్యమకారిణి

వాల్మీకిపురం: భారత మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, తొలి మహిళా సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం జేవీవీ అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ స్త్రీ అభ్యుదయానికి, బాలికల విద్యకు శ్రీకారం చుట్టిన సావిత్రిబాయిపూలే బాల్య వివాహాలకు, మూఢనమ్మకాలకు, సతీసహగమనములను రూపుమాపటానికి జీవితాంతం కృషి చేశారన్నారు. తమ జీవిత కాలంలో 54 పాఠశాలలను స్థాపించి అణగారిన బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటు పడ్డారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మంజుల, ఉపాధ్యాయులు సోఫియా బేగం, వాసంతి, సురేఖ, అరుణ కుమారి, ముహినాఖానమ్, కోకిల, రమీజా, నవమల్లిక పాల్గొన్నారు.

ఆదర్శ మహిళ

కలకడ : ఆదర్శ మహిళ సావిత్రిబాయ్‌పూలే అని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావలి అన్నారు. మంగళవారం జాతీయ మహిళ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో మహిళా ఉపాధ్యాయునులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి



సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

పీలేరు : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఒకటవ సచివాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు బాధ్యతాయుతంగా పని చేసి ఎప్పటి సమస్యలు అప్పుడే పరిష్కరించాలన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట మురుగునీటి కాలువలు, సీసీ రోడ్లు ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 116 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా, మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షఫీ, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కడప గిరిధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు ఎన్.వి. చలపతి, హరిత, మండల కోఆప్షన్ సభ్యుడు రెడ్డిబాషా, నాయకులు హుమయూన్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరేంద్రరెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి, ఎంఈఓ బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ

గుర్రంకొండ : ఉపాధ్యాయులే సమాజానికి మార్గనిర్దేశకులని ఎంఈఓ సురేంద్రబాబు అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎస్టీయూ నూతన క్యాలెండర్లు, డైరీలను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. ఉపాధ్యాయులే సమాజానికి దిశానిర్దేశకులు అన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలన్నారు. తమ విధుల పట్ల అంకితభావం కలిగిన ఉపాధ్యాయులే సమాజంలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్, ముక్తియార్‌అహ్మద్, జిల్లా కౌన్సిలర్లు అక్బర్, ఎల్లారెడ్డి, రాజేంద్రబాబు,గోపాలకృష్ణ, హరీష్, దుర్గాప్రసాద్, మహిళా కన్వీనర్ శిరిష, హేమమాలిని, జిల్లా మహిళా కార్యదర్శి ప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.

నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఇద్దరు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పీలేరు రూరల్ : సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏపీ తరపున ఆడడానికి స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బి. వెంకటరత్నం, తులసీరామ్ ఎంపికైనట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి తెలిపారు. మంగళవారం కళాశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు మహారాష్ట్రలో నిర్వహించే 40వ సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌సిప్ పోటీల్లో ఇద్దరూ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య సంచాలకులు డాక్టర్ ఎ.సి. భరణినాథరెడ్డి, అధ్యాపకులు నారాయణస్వామి, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ హరిప్రసాద్, కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సేవ ట్రస్టు కోసం నగదును ఎమ్మెల్యే చింతలకు అందజేస్తున్న దాత

వాల్మీకిపురం : సేవా కార్యక్రమాలకు దాతల సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం పీలేరుకు చెందిన భవనం వెంకట్రమణారెడ్డి స్థానిక సాయి నారాయణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి లక్ష రూపాయల నగదును ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిరుపేదలను ఆదుకోవడం ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. మనం ఆర్థికంగా ఎంత ఎత్తుకు ఎదిగినా సమాజంలో మనం చేసే సేవా కార్యక్రమాలే సంతృప్తిని ఇస్తాయన్నారు. మానవసేవే మాధవసేవ అన్నారు. కార్యక్రమంలో నాయకులు వైస్ ఎంపీపీ ఎస్.వి చలపతి, గాయం భాస్కర్ రెడ్డి, కె.భాస్కర్ రెడ్డి, భవనం కిశోర్ కుమార్ రెడ్డి, న్యాయవాది వెంకట్రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గుర్రంకొండ : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు వరదారెడ్డి నారదరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ముక్తియార్ అన్నారు. మంగళవారం మండలంలోని బురుజుపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను, లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త పింఛన్లు మంజూరు చేసిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశులు, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు అప్పుల్ల, సర్పంచ్ రాధమ్మ, ఎంపీటీసీ గంగులమ్మ పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కోచ్‌లు

మదనపల్లె సిటీ: 23వ జాతీయస్థాయి స్వ్యయ్ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మదనపల్లెకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జమ్మూలో గత ఏడాది డిసెంబర్ 30 నుంచి జనవరి 2వరకు జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. మదనపల్లెకు చెందిన 21 మంది విద్యార్థులు మొత్తం 26 మెడల్స్ సాధించారు. ఇందులో జూనియర్స్ విభాగంలో 9 గోల్డ్, 2 సిల్వర్, 3 బ్రాంజ్, సీనియర్ మాస్టర్స్ విభాగంలో 2 గోల్డ్ మెడల్స్ సాధించారని రాష్ట్ర మార్షల్ ఆర్ట్స్ జాతీయ సంయుక్త కార్యదర్శి ఇస్మాయిల్, కోచ్ ఖాదర్‌బాషా, నరసింహులు తెలిపారు. వీరిని మంగళవారం అభినందించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

కురబలకోట: ఆకస్మికంగా మృతి చెందిన మండలంలోని వనమరెడ్డిగారిపల్లె వైఎస్సార్ సీపీ నాయకుడు పిచ్చల ఈశ్వర్‌రెడ్డి కుటుంబానికి అండగా నిలుస్తామని మండల వైస్ ఎంపీపీ ఎస్‌వి రమణారెడ్డి, సర్పంచ్‌లు సోమిరెడ్డి, శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాలతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ నుండి వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరు చేశారు. అంత్యక్రియలకు ముందుగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు తెలిపారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

పీలేరు : పీలేరు లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం స్థానిక షఫీ కల్యాణ మండపంలో 40 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ప్లాటినమ్ అధ్యక్షుడు బి. వేణుగోపాల్ మాట్లాడుతూ చలితీవ్రత ఎక్కువుగా ఉన్నందున వృద్ధులను ఆదుకోవడానికి తమవంతు సాయం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఏకాంతంరెడ్డి, ట్రెజరర్ ఎస్ఎండి. షఫీ, ప్లాటినం సభ్యులు సంజీవరెడ్డి, శ్రీహరిరెడ్డి, ఫణికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంకీర్తనలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు, అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం పూజలతో పాటు రాత్రి 10 గంటల నుంచి అన్నమాచార్య ప్రాజెక్టు బృంధంకు చెందిన హేమమాలిని మంగళవారం ఉదయం 6 గంటల వరకు సంకీర్తనలు నిర్వహించారు. సనగరం పట్టాభిరామయ్య, ఆకుల మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

–ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

నిమ్మనపల్లె: ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆర్డీవో మురళి అన్నారు. మంగళవారం నిమ్మనపల్లెలోని రైతులు సింగరాజు హేమలత, రెడ్డమ్మ, రామప్ప, శివరాంలకు చెందిన సర్వే నంబర్లు 432, 433-1,2,3 లలోని 1.42 సెంట్ల ఉమ్మడి వ్యవసాయ భూమిని ఆర్డీవో పరిశీలించారు. సదరు భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు సంబంధిత రైతులు దరఖాస్తు చేసుకోగా పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. తహసీల్దార్ సీఆర్ మంజుల, రీ సర్వే డిటీ సిరాజుద్దీన్, సర్వేయర్ మురళినివివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రామప్రసాద్, విఆర్ఓ రజనీకాంత్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ములకలచెరువు: ఏఎన్ఎంలు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని ఎంపీహెచ్ఈఓ రమణ అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలతో ఎంపీహెచ్ఈఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి జ్వరం, ఇరతా వ్యాధులు సోకకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

గుర్రంకొండలో భక్తుల ర్యాలీ

గుర్రంకొండ : మండలకేంద్రమైన గుర్రంకొండలో శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దమండ్యం, గుర్రంకొండ మండలాలకు చెందిన ఎస్సీ, ఎస్టీలను ఉచిత వైకుంఠ దర్శన కార్యక్రమంలో భాగంగా తిరుమలకు ఉచితంగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కోట వరకు ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- ప్రజా సంక్షేమమే సీఎం ధ్యేయం
- పార్టీ కార్యకర్తలే ముఖ్యం
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె: నియోజకవర్గ అభివృద్ధిని చూసి ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని ఆదరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో నియోజకవర్గస్థాయిలో నూతన పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు పెన్షన్ల పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో పాలాభిషేకం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పరిస్థితులు, అవ్వాతాతల స్థితిగతులు గుర్తించి వైఎస్సార్ పెన్షన్ పథకం తీసుకొచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు విడతలుగా పెన్షన్ పెంచుతూ రూ. 2750 ఇస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో ఒక్క పెన్షన్ మంజూరు కావాలంటే పెన్షన్‌దారుడు మృతి చెందితేనే ఇచ్చేవారన్నారు. చంద్రబాబు, కుమారుడు లోకేష్‌లు మరికొందరు వారి అనుచరులు కుక్కలు మొరిగినట్లు మొరగడమే తప్పా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని ఎన్నడూ పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు అనుచరులు , కార్యకర్తలు గ్రామాల్లో గొడవలు చేసి శాంతి భద్రతలకు శాంతి విఘాతం కల్పించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గత ప్రభుత్వంలో రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కోసం వెళ్లితే లంచం లేనిదే ఇచ్చేవారు కాదన్నారు. నియోజకవర్గంలో ఒక్కసారిగా 7వేల ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు నేరుగా ఇచ్చిన ఘనత ప్రభుత్వానిదేన్నారు. తంబళ్లపల్లెకు ఓ ప్రత్యేక అరుదైన అవకాశం జిల్లా తరపున పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రిగా, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తమకు అవకాశం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. చరిత్రలో లేని విధంగా నేడు తంబళ్లపల్లె అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గంలొ ఎక్కడాలేని విధంగా 21వేల ఇండ్లు మంజూరు చేశామన్నారు. ఇంటి ప్రతిపక్ష నాయకులు చేసే ఆరోపణలపై ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. ఈసంద్భంగా 1312 మందికి పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు అనసూయమ్మ, పూర్ణచంద్రిక, దస్తగిరి, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, రాష్ట్రపద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్రనాథ్, నాయకులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, కొండ సిదార్థ, నారాయణరెడ్డి, సురేంద్ర, కోటిరెడ్డి, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సమస్యలు తెలుసుకుంటునన ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు సంక్షేమ పథకాలు ఆగవని, ప్రజలకు సేవ చేసేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చినట్లు తెలిపారు. పట్టణంలోని 26వవార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే నవాజ్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజంలతో కలిసి ఇంటింటికీ పర్యటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వైఎస్సార్ సీపీ మూడున్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలపై తెలపాల్సిందిగా కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వంలో పెన్షన్ పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ ప్రదక్షిణలు, పదో తేదీవరకు పడిగాపులు తప్పేవికావన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఒకటోతేదీ ఉదయాన్నే ఠంచనుగా ఇంటి తలుపును తట్టి పెన్షన్ అందించడం జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమాభివృద్ధిని చూసి ఓర్వలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఆర్.వి.శివారెడ్డి, డిష్ రామకృష్ణారెడ్డి, బి.ఏ.ఖాజా, నాగార్జునబాబు(గాంధీ), వసీం, సుగుణ, ఈశ్వర్‌నాయక్, ఎస్వీ.రమణ, రాజేష్, కరీముల్లా, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్.ఇర్ఫాన్‌ఖాన్, బాలగంగాధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల సంరక్షణలో ఆశాల పాత్ర కీలకం



ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్యామల

కేవీపల్లె : తల్లీబిడ్డల సంరక్షణలో ఆశా కార్యకర్తల పాత్ర కీలకమైందని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్యామల అన్నారు. మంగళవారం గర్నిమిట్ట పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, సీజనల్ వ్యాధుల నియంత్రణ, కుటుంబ వైద్యుల విధానం తదితర అంశాలపై ప్రజల్లో చైతన్యం నింపడానికి ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. 'కిల్కారి' కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, తల్లులకు ఐవీఆర్ఎస్ విధానంలో ఆడియో కాల్స్ ద్వారా వారి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ఆశా కార్యకర్తల విజ్ఞానం, నైపుణ్య స్థాయిలను పెంపొందించడానికి మైబైల్ అకాడమీ ఏర్పాటు చేయడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రేష్మ, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, ఆరోగ్య విస్తరణాధికారులు కృష్ణమ్మ, కృష్ణయ్య, పీహెచ్ఎన్ రమాదేవి, పర్యవేక్షకులు పురుషోత్తం, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో మంగళవారం శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలో వేదపండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు, రక్షాబంధనం, బాసింగధారణ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ సిద్ధి గణపతి, శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి, శ్రీ శనేశ్వర స్వామి, శ్రీ లింగోద్భవ మహాశివుడు, ధ్యాన శిరిడిసాయిబాబా మూల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, అభిరాం, ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

డ్వామా పీడీ మద్దిలేటి



ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న డ్వామా పీడీ

కేవీపల్లె : ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలని డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురం, మఠంపల్లె గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధిలో చేపట్టిన పనులు పరిశీలించారు. సప్లై చానల్ పనులు, మామిడి మొక్కల పెంపకం పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా మంజూరైన పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఆదేశించారు. కూలీలు కోరిన విధంగా పనులు మంజూరు చేయాలన్నారు. ఉపాధిలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన పెంపొందించి ఆ పనులు చేపట్టుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్ర స్థాయిలో పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ మధుబాబు, ఏపీఓ అంజినప్ప, జేఈ జి.వి. రమణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



మహల్‌లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందచేస్తున్న డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, తదితరులు

కలికిరి : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసి ట్యాబ్‌లను మంగళవారం ప్రజాప్రతినిధులు విద్యార్థులకు అందజేశారు. మహల్ తెలుగు, ఉర్దూ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, మండల పార్టీ కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి, మేడికుర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్‌రెడ్డి, పల్లవోలు గ్రామం గడి ఉర్దూ పాఠశాలలో సర్పంచ్ బేబి ఆయిషా చేతుల మీదుగా ట్యాబ్‌లను అందజేశారు. అలాగే పింఛను వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పింఛన్లను లబ్ధిదారులకు రాష్ట్ర మైనార్టి కార్పొరేషన్ చైర్మన్ అందజేశారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమాలలో మండల కో-ఆప్షన్ సభ్యులు రిజ్వానుల్లా, అద్దవారిపల్లి సర్పంచ్ గంగయ్య, మేడికుర్తి ఎంపీటీసీ సభ్యులు అల్లాబక్షు, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జుబేర్ అహ్మద్, రియాజ్ ఖాన్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.